


# సాంత్వన

- దూరి వెంకటరావు

ఇన్నాళ్ళూ ఎంతో అపురూపంగా చూసుకుంటున్న ఇల్లు రేపు పరాధీనమై తోంది. తన అభిరుచులకనుగుణంగా నిర్మించుకున్న పొదరిల్లు తెల్లవారితే తనదికాదు. ఇందుకేనా తనెంతో శ్రమపడి కట్టుకున్నది? ఇంటిని విడిచి వెళ్ళాలంటే ప్రాణం వదిలి వెళుతున్నంత బాధగా ఉంది. అయినా గుండె దిటవు చేసుకోక తప్పదు. రేపటి ఘడియల్ని తలచుకుంటూ ఉంటే దుఃఖం ఆగడం లేదు పార్వతీశానికి.

'పార్వతీ నిలయం' ఆరున్నర లక్షలకు అమ్ముడైపోయింది. గత నెలలో యాబై వేలిచ్చి పురోణీ రాయించుకున్నారు. మిగతాది రేపిచ్చి రిజిస్ట్రేషను చేయించుకుంటారు. ఇవాళ్టితో తనకు ఈ ఇంటికి ఋణం తీరిపోతుంది.

నాకెవరి సమస్యలతో సంబంధం లేదన్నట్లు కాలం దాని మానాన అది సాగిపోతోంది. చీకటి పడుతున్నా దీపం పెట్టబుద్ధి కాలేదు. వరండాలో దిగులుగా కూర్చుని అదే పనిగా ఆలోచిస్తున్నాడు పార్వతీశం.

కిర్రుమంది గేటు.

వస్తున్నది భానుమూర్తి. తన బాల్యమిత్రుడు ఉన్నట్లుండి వాడెందుకు ఊడిపడ్డాడో తెలీడంలేదు. కొంపతీసి తను ఇల్లు అమ్ముతున్న విషయం పసిగట్టాడేమో!

అనుకున్నట్లుగానే "ఏరా ఇల్లు అమ్మేస్తున్నావట నే విన్నది నిజమేనా" అంటూ లోపలకొచ్చాడు. ఔనన్నట్లు తల ఊపాడు పార్వతీశం కంట తడి కనబడనీయ కుండా జాగ్రత్త పడుతూ.

పార్వతీశం పడుతున్న అవస్థ చూస్తుంటే వాడా ఇంటి మీద పెంచుకున్న మమకారాన్ని త్రెంచుకోలేకపోతున్నాడని అర్థమైపోయింది భానుమూర్తికి.

"ఇల్లమ్ముకునే కర్మ నీకేంట్రా. ప్రభుత్వోద్యోగం చేసి రిటైరయ్యావు. పెద్దవాళిద్దరూ ఉద్యోగాల్లో స్థిరపడిపోయారు. ఇహకొంప అమ్ముకోవడం దేనికి?" మిత్రుడి భుజంమీద చెయ్యివేస్తూ అనునయంగా అడిగాడు భానుమూర్తి.

అతడు కనపరుస్తున్న సానుభూతిని భరించలేకపోతున్నాడు పార్వతీశం.

"అది కర్మో ప్రారబ్ధమో నాకు తెలీదు. అవసరం నాచేత ఆ పని చేయిస్తోంది".

"ఎంత పనిచేసావురా. మాటమాత్రంగానైనా నాకు చెప్పుంటే ఇల్లు అమ్మనిచ్చే వాణ్ణి కాదు".

"నువ్వు అంత పని చేస్తావనే చెప్పలేదు. పైగా ఇదే మంత శుభవార్తని ఊరంతా డప్పు వాయిస్తూ చాటింపు వేయడానికి".

పార్వతీశం మాటల్లో నైరాశ్యం.

"అవసరం అన్నావు అదేదో బయటకు చెబితే నా చేతనైన సహాయం చేస్తాను. నేను నీ ప్రాణస్నేహితుణ్ణి. నా దగ్గర కూడా దాచాలని ప్రయత్నించకు. జరిగిందేదో జరిగిపోయింది. వాళ్ళకు యాభైవేలు ముదరా ఇచ్చైనా ఇల్లు అమ్ముడుకాకుండా చూస్తాను" అభయమిచ్చాడు భానుమూర్తి.

మిత్రుడి మాటలు పార్వతీశానికి ఊరంత ఊరటనిచ్చాయి. ఇంతవరకు ఎవరి నుంచి తనకు ఆ మాత్రం ఓదార్పు కూడా లభించలేదు. అందుకే నోరు విప్పాడు.

❖ ❖ ❖

పార్వతీశం రెవెన్యూ డిపార్టుమెంట్లో సీనియర్ అసిస్టెంటుగా పనిచేసి రిటైరయ్యాడు. భానుమూర్తి అతడి క్లాసమేటు. ఇరువురూ డిగ్రీవరకు కలిసి చదూకున్నారు. అప్పట్లో చదువవడంతోనే వాళ్ళకు ఉద్యోగాలొచ్చాయి. భానుమూర్తి రైల్వేలో గార్డుగా పనిచేసి రెండేళ్ళ క్రితం పదవీ విరమణచేసాడు. ఇద్దరూ వేర్వరుచోట్ల పనిచేసినా చివరికి ఉన్న ఊల్కోనే ఇలు కట్టుకుని స్థిరపడ్డారు. పార్వతీశానికి ముగ్గురబ్బాయిలు. పెద్దవాళిద్దరూ తను సర్వీసులో ఉండగానే చదువులు పూర్తిచేసి ఉద్యోగాల్లో చేరిపోయారు.

వాళ్ళ చదువులకోసం ఆఫీసులో అడ్వాన్సులు పెట్టాడు. అది చాలదన్నట్లు బయట అప్పులు చేసాడు. ఆర్జనపరులవడంతో వాళ్ళకు పెళ్లిళ్లు చేసాడు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ రాగానే చేసిన చిన్న చితక అప్పలు తీర్చేసి మిగిలిందాంతో చిన్న గూడు నిర్మించుకున్నాడు. అప్పటికే భార్య గతించింది. ఆఖరి వాడి చదువింకా కొనసాగుతూ ఉండటంతో అతణ్ణి ఇంకా బాధ్యతలు వీడలేదు. ఎమ్.సెట్ రాసిన సూర్యం బి.ఇ. కంప్యూటర్స్ చేస్తానంటున్నాడు.

చేరబోయేది ప్రవేటు కాలేజీలో ఎంత లేదన్నా ఐదారు లక్షలు అవసరమౌతుంది. ఆ డబ్బు వాడి పేర పాస్‌బుక్కులో వేసి ఉంచితే తప్ప చదువు సవ్యంగా సాగదు. ప్రవీణ్, ప్రకాష్‌లు తమ్ముడికి ఆర్థిక సహాయంచేస్తే పరవాలేదు. లేకపోతే కష్టమే. తనకొచ్చే పెన్షను తిండికి, మందులకే సరిపోతోంది. పోనీ అప్పుచేద్దామన్నా ఇచ్చే దాత కనిపించడంలేదు. మరి గత్యంతరం లేక బెంగుళూరులో వున్న పెద్దవాణ్ణి కలిసాడు.

ఎన్నడూ గడపదాటని నాన్న తనకోసం అంత దూరం వచ్చినందుకు తెగ సంబరపడిపోయాడు ప్రవీణ్.

రాక రాక వచ్చిన మావగారికి కోడలు సకల మర్యాదలు చేసింది.

'తాతయ్యా!' అంటూ దగ్గరకొచ్చాడు అక్షయ్.

మనవణ్ణి ప్రేమగా దగ్గరకు తీసుకుని తల నిమిరాడు పార్వతీశం.

"నాన్నగారికి సేమ్యా పాయసమంటే భలే ఇష్టం. జీడిప్ప కాస్త ఎక్కువగా వేసి వండు" భార్యని అదేశించాడు ప్రవీణ్.

సాయంత్రం తండ్రిని కార్లో కూర్చోబెట్టి ఊరంతా తిప్పాడు. చూడవలసిన ప్రదేశాలన్నీ చూపించాడు.

బిడ్డ వైభవాన్ని చూసి మురిసిపోయాడు పార్వతీశం.

కొడుకు కోడులు తన పట్ల చూపుతున్న అవ్యాజమైన ప్రేమకు చలించిపోయాడు. తప్పకుండా వాడు తమ్ముడికి అంతో ఇంతో సహాయం చేస్తాడనుకున్నాడు.

రాత్రి భోజనాల దగ్గర సూర్యం ప్రస్తావన రానే వచ్చింది. "ఎంత పనైపోయింది నాన్నా. మొన్నటివరకు బ్యాంకులో ఐదు లక్షలు బ్యాలెన్సు ఉండేది. ఈ మధ్యే ఆ డబ్బు డ్రాచేసి కారు కొన్నాను. ఈ ముక్క ముందే చెప్పంటే కారు తీసుకోకపోదును" తన అసక్తతను వ్యక్తం చేసాడు ప్రవీణ్.

అంతవరకు వాడి మీద పెట్టకున్న ఆశ కాస్త నీరుగారిపోవడంతో ఏమనాలో తెలీక "పోన్లేరా, డబ్బు లేకపోతే నువ్వు మాత్రం ఏం చేస్తావ్? నీలాగే మీ తమ్ముణ్ణి కూడ ప్రయోజకుడవ్వాలని వాడిని ఇంజనీరింగు చదివిద్దామనుకున్నాను. ఫ్చ్... ఇంతకీ వాడి అదృష్టం ఎలా ఉందో! నిట్టూరుస్తూ అక్కడ నుండి బయలుదేరి హైదరాబాదు వెళ్ళాడు.

అక్కడ కూడ పార్వతీశానికి అఖండ స్వాగతం లభించింది. తీరా విషయాని కొచ్చేసరికి "సారీ నాన్నా గత నెలలో ఆరు లక్షలు పెట్టి ప్లాటు తీసుకున్నాను" నొచ్చుకుంటున్నట్లు అన్నాడు ప్రకాష్.

"మరి నువ్వుందులో దిగలేదేం?" సందేహం వ్యక్తం చేసాడు పార్వతీశం.

"కంపెనీవారిచ్చిన క్వార్టరు ఎలానూ ఉంది కదా అందుకే కొన్నప్లాటును

రెంటుకిచ్చేసాను" సంబరపడుతూ అన్నాడు ప్రకాష్.

అన్నదమ్ములిద్దరూ ఎవరి బాగు వాళ్ళుచూసుకుంటున్నారే తప్ప తమ్ముణ్ణి గురించి ఏ ఒక్కరూ ఆలోచించడం లేదు. ఇక అక్కడుండి ప్రయోజనం లేదనుకుని బయలుదేరాడు పార్వతీశం.

"ఇలా వచ్చి అలా వెళ్ళి పోవడమేంటి నాన్నా నాలుగు రోజులు ఉంటావనుకున్నాను".

"లేదు రా వెళ్ళాలి. వెంటనే సూర్యానికేదో ఏర్పాటుచెయ్యాలి. ఫీజు కట్టకపోతే సీటు గల్లంతవుతుంది. వాడి ఆశయానికి గండికొట్టలేను" అంటూ భారమైన మనసుతో అక్కడ నుండి బయటపడ్డాడు పార్వతీశం.

★★★

"పెద్దవాడి చదువుకోసం ఆఫీసులో అడ్వాన్సుమీద అడ్వాన్సు పెట్టాను. చిన్నవాడి చదువుకు ఇంట్లో ఖర్చులు తగ్గించుకుని ఊర్లో అప్పులు చేసాను. చదివించినందుకు వాళు ప్రయోజకులయ్యారు. నువ్వా? నేనా? అన్నట్లు దర్జాగా బతుకుతున్నారు. ఎటొచ్చి సూర్యం చదువుకే నా దగ్గర పైసా లేకుండా పోయింది. అన్నదమ్ములిద్దరూ తమ్ముణ్ణి చదివించకపోతారా అనుకున్నాను. లేకుంటే ఇల్లు కట్టకే పోదును. రిటైరయిపోయినవాణ్ణి నాకిప్పుడు తీర్చేమార్గం లేదు. ప్రవీణ్, ప్రకాష్‌లను ఎలా చదివించి వృద్ధిలోకి తీసుకొచ్చానో అలాగే వీడికి కూడ ఏదో ఒక దారి చూపించాలి. పిల్లలు ముగ్గురూ నా శరీరంలోని మూడు అవయవాలు. వాటిలో ఏది చచ్చుబడ్డా బాధ నాకే కదా! మరో దారేదీ కానరాకనే ఇల్లు అమ్ముకోడానికి సిద్ధపడ్డాను. అనుకున్నదే తడవుగా బేరం వచ్చింది. కాదనలేక పోయాను" కంట తడి పెడుతూ అన్నాడు పార్వతీశం.

"నేను అన్నానని బాధపడకు. నువ్వు పడ్డ శ్రమకి. నీ కొడుకుల నుంచి నీకు దక్కిందేమిటి?... ఏమీ లేదు. అయినా నీకింకా బుద్ధిరాలేదు. సూర్యం చదువుకోసం ఉంటున్న గూడునే వదలుకోవాలనుకుంటున్నావు. చివరికి వాడు మాత్రం నిన్ను చూస్తాడన్న గ్యారంటీ ఏమిటి?... నిలువ నీడ లేక, పిల్లల ఆసరా లేకుండా జీవితాన్ని ఎలా కడతేర్చుకుంటావురా?... వద్దు... నా మాట విని నీ ఆలోచన విరమించుకో" హితవు పలికాడు భానుమూర్తి.

"నువ్వెన్ని చెప్పు నా నిర్ణయంలో మార్పు ఉండదు."

స్థిరంగా పలికాడు పార్వతీశం.

"అది సరే ఇల్లు అమ్మగా వచ్చిన డబ్బును వాడిపేర బ్యాంకులో వేసేసి వాణ్ణి హాస్టల్ చేర్పిస్తే నువ్వెక్కడుంటావ్?" సందేహం వ్యక్తంచేసాడు భానుమూర్తి.

"ఆ ప్రశ్న నువ్వు వేసావు గాని నా పిల్లలెవరూ అడగలేదురా, రేపు ఇల్లు రిజిస్ట్రేషను అవుతుందని తెలిసి పెద్దవాళ్ళిద్దరూ వచ్చారు. కొంప అమ్మేస్తున్నందుకు నిష్ఠూరాలాడారు. దాంట్లో వాళ్ళకు వాటా లభించనందుకు తెగ బాధపడిపోయారు. ఇది నా స్వార్జితం అవబట్టి ఏం చేయలేక కోపంతో నిప్పులుచెరిగి వెళ్ళిపోయారు. అంతే తప్ప ఇల్లు అమ్మేసి నువ్వెక్కడుంటావని ఒక్కమాట అనలేదురా. అదేరా నా బాధంతా" కళ్ళు వత్తుకుంటూ అన్నాడు పార్వతీశం.

"నువ్వేం దిగులు పడకు. నాకు లంకంత కొంపఉంది. అంత పెద్దింట్లో నేనూ నా భార్యే ఉంటున్నాం. అమెరికాలో ఉన్న మా అమ్మాయి అల్లుడు ఎప్పుడో గాని రారు. నాకు వెనకాముందు మరెవరూ లేరని నీకు తెలుసు. నీకు అభ్యంతరం లేకపోతే మా ఇంటి కొచ్చేయ్. నువ్వొస్తే నాకు బోలెడంత కాలక్షేపం.

ఇద్దరం రోజూ సరదాగా కబుర్లు చెప్పుకుందాం. గత స్మృతుల్ని నెమరువేసు కుందాం. సాయంత్రంపూట శంకరమఠానికెళ్ళి ఆధ్యాత్మిక ప్రసంగాల్ని విందా" చెప్పుకుపోతున్నాడు భానుమూర్తి.

అతడి మాటలు పార్వతీశానికెంతో సాంత్వన కలిగించాయి.

"నువ్వామొక్క అన్నందుకు నాకెంతో ఆనందంగా ఉంది. ఇంతకి ఏ సంబంధాన్ని పురస్కరించుకుని నన్ను మీ ఇంటికి రమ్మంటున్నావో నాకర్థంకావడం లేదు."

"అదేంటి అలా అంటావ్ మన మధ్య ఏ సంబంధం లేదా? స్నేహబంధం బంధంకాదా! అది నా దృష్టిలో ఎంతో ఉన్నతమైంది. మనమంతా ఎంతో గొప్పగా చెప్పుకునే రక్తసంబంధంలో కూడా స్వార్థమే ఉందన్న విషయాన్ని నువ్వు ప్రత్యక్షంగా తెలుసుకున్నావు. స్నేహ బంధంలో మాత్రం ఎటువంటి స్వార్థం ఉండదు. అదెంతో స్వచ్ఛమైంది. నిర్మలమైంది. ఆ బంధాన్ని పురస్కరించుకునే నిన్ను నా ఇంటికి ఆహ్వానిస్తున్నాను" అన్నాడు భానుమూర్తి.

"నాకంత అదృష్టమా"! అన్నట్లు మిత్రుడి వంక దీనంగా చూసాడు పార్వతీశం.

(2-11-2008 ఆంధ్రభూమి ఆదివారం అనుబంధం)